



కథానిక

సి. ధర్మారావు

చాలా కాలానికి స్నేహితులిద్దరూ తిరిగి రాజమండ్రి స్టేషనులో కలుసుకున్నారు. వాళ్ళిద్దరూ అప్పుడు అమృతోపమానమైన పానీయాలు వేటినీ సేవించడంలేదు; చూపు మరల్చరాని అందాల్నేమీ తిలకించటంలేదు; అత్యంత వైభవోపేతమైన నృత్యనాటకాది ప్రదర్శనలలో పాల్గొనటంలేదు. ఇద్దరూ ఒకరికొకరు దగ్గరగా వున్నారు; ఏదేదో మాట్లాడుకుంటున్నారు; ఒకరిపక్కగా ఒకరు నడుస్తున్నారు. అయినా అపైవేవీ ఇవ్వలేని అనిర్వచనీయమైన సౌఖ్యాన్ని అనుభవిస్తున్నారు ఆ యిద్దరు స్నేహితులూ అప్పుడు.

రాజారావు బండిని పిలుస్తున్నాడు. బెడ్డింగు కూలివాడికిచ్చి నడిచిపోదామన్నాడు రామారావు. స్టేషనుదాటి స్నేహితులిద్దరూ రోడ్డుమీదికి సాగారు. సాయంకాలపు చల్లగాలి, నీరెండ స్నేహితులకి అధికోల్లాసాన్ని కల్గించలేకపోతున్నాయ్. రాజారావు అన్నాడు:

"ఏరా, అన్నికబుర్లూ చెప్పి చివరికి అలా చేశావు? మళ్ళీ ఏ 'న్యూ ఐడియా' ఆవహించింది మనల్ని?"

సందర్భం తెలుసుకోవటానికి రామారావుకి ఆలోచించవలసిన అవుసరం లేదు, అది అంత ప్రాముఖ్యంగల సంగతి.

"ఆగరా, ముందు ఇంటికి పద. ఈ రోడ్డుమీద ఈ ప్రయాణపు బడలికతో ఇప్పుడు చెప్పనా అలాంటి సంఘటన? భోంచేశాక తీరిగ్గా పడుకుని ...అప్పుడు! అసలు అది చెప్పదామనికదూ నీ దగ్గిర ఆగింది? అన్నట్టు, మీకు మేడగదుంది కదూ?" అనడిగాడు రామారావు.

"ఊఁ."

"ఆ. ఆ గదిలో పక్కలు పరిపించెయ్. నీ మంచంమీద నువ్వు పడుకో. కిటికీదగ్గర కుర్చీ వేసుకుని బయటి నల్లటి ఆకాశంలోకి చూస్తూ ఆ సంఘటన తాలూకు వివరాలు ఒక్కొక్కటిగానే చెపుతోంటే నువ్వు ఊకొడుతూండు, తెల్లవారినా ఇబ్బందుండదు."

రాజారావు నవ్వాడు. "మొత్తంమీద ఆ ధోరణిమాత్రం పోలేదు" అన్నాడు.

ఆ ధోరణి నాలుగైదేళ్ళక్రితం గుంటూరులో వాళ్లు చదువుకున్న నాటిదని రాజారావు తాత్పర్యం.

రామారావు తనకి పెళ్ళి చేసుకోవాలని ఏమాత్రం లేదనీ, ఏదో అంటీఅంటకుండా తన బ్రతుకుని కొనసాగించటమే తన అభిమతమనీ స్నేహితునితో తరుచు జరిగే చర్చలలో వ్యక్తపరుస్తుండేవాడు. తరువాత ఆనర్సు చదివేప్పుడైనా తన అభిప్రాయం మారుతున్నట్టుగాని మార్చవలసిన అవుసరం ఏర్పడినట్టుగాని ఎన్నడూ రాజారావుకి రాయలేదు. తీరా క్రిందటి వేసవిలో రామారావు వివాహవార్త మోసుకొచ్చిన శుభలేఖ రాజారావుని సంభ్రమాశ్చర్యాలలో ముంచివేసింది. కాని పెళ్ళికి వెళ్ళటానికి రాజారావుకి పడలేదు. ఆతరువాత ఒకళ్ళసంగతి ఒకళ్ళకి తెలియలేదు. మళ్ళీ ఈమధ్య వీళ్లిద్దరిమధ్యా నడిచిన మూడు నాల్గుఉత్తరాలు అయిదేళ్ళ తరువాత స్నేహితుల మధ్య ఈ కలయికను సంఘటించినవి.

ఎన్నో కొత్తవీ, జీవితపథాల్ని మార్చివేసినవీ, అయిన సంఘటనలు ఒకళ్ళవి ఒకళ్ళతో చెప్పుకోటానికి ఉత్సాహిస్తున్న స్నేహితులు అలావుండటంలో ఆశ్చర్యమేముంది? నడుస్తూ నడుస్తూ ఏదో ఆలోచన తట్టినవాడిలా

ఆగి నవ్వుని పెదవులకింద అణచిపెడుతూ రాజారావు అన్నాడు:

"అరేయి, మళ్ళీ మనం వచ్చేప్పటికి సినిమాకి టిక్కెట్లు అయిపోతాయేమో ఇప్పుడే 'శ్యామలా'కి పోయి రెండు టిక్కెట్లు తెస్తా, ఇక్కడేవుండు, హాలు ఇక్కడే."

"ఏడిగావులేరా, వెధవసినిమా నువ్వూనూ! నీ రూములో పడుకోబెట్టి ఎన్నెన్నో సౌందర్య సీమల్ని ... అలాఅలా రీలుల్లాగ చూపెడ్తా రారా అంటూంటే..." అన్నాడు రామారావు చిరుకోపాన్ని అభినయిస్తూ.

బిగ్గరగా నవ్వి "సరే, పద" అన్నాడు రాజారావు.

* * *

"నువ్వింకా సిగరెట్టు నేర్చుకోలేదురా?" అన్నాడు రాజారావు.

"నేర్చుకుందామని చూశానుగాని, అందులో ఏమీ స్వారస్యం కనిపించలేదురా, రాజా...సరే కాని ఎలావుంటోందిరా ఇక్కడి జీవితం?"

"ఎంతచచ్చినా బొంబేగదా, కాలక్షేపాలకేమీ కొదువలేదు. నా 'వర్క్' కూడా ఏమంత 'హెవీ' అయిందికాదు. రెండు రకాల స్థాయీ సంగీతాలకి మా అమ్మాయీ, రేడియో వుండటంచేత సుగుణ కూడా బాగానేవుంది. వచ్చే రెండువందల పాతికలో మిగల్చకపోయినా సరిపెడుతున్నాం కొత్తరోజులు గనుక" అన్నాడు రాజారావు. "ఈ గొడవకేంగాని, నీది కానియ్ ముందు, తొమ్మిది దాటుతోంది"

"ఏంలేదురా! అంతా 'యాక్సిడెంటు.' రాధ అనే ఒకజవ్వని వీడిజీవితంలో ప్రవేశించి కొన్ని ద్వారాల్ని శాశ్వతంగా మూసేసి మరికొన్నిటిని అతిశాశ్వతంగా తెరిచింది. దాంతో ఈ అలజడి ప్రపంచంలో ఒకపెద్ద 'పీస్ ఏరియా'తో పాటు ఒక 'బ్యూటీ ఏరియా' ఏర్పడింది" అని ఆగాడు రామారావు, రాజారావు నవ్వును ఆపేసేవరకు. "అతను నిరుడే మా 'ఆనర్సు' మొదటి సంవత్సరములో చేరాడు. సంవత్సరారంభంలోనే ఎలాగో కాస్త పరిచయం ఏర్పడ్డది. మా 'సబ్జక్టు' వాడే కావడంచేత ఏదో నోట్సులకనీ, 'ఎస్సే'లకనీ నా రూము కొస్తూండేవాడు. వాళ్ళది వైజాగే; డాబా గార్డెన్సు నివాసం. రాజా, ఒకసారి నా టార్చిలైటు ఏదో సందర్భంలో పట్టుకెళ్ళాడురా! మూడు బాటరీలది, 'బ్రిటిష్ మేడ్!' తీసుకెళ్ళేప్పుడే చెప్పాను "నాకు త్వరలో టూరు వెళ్ళాల్సిన అవసరంవుంది, కాస్త ఈసారి వచ్చేటప్పుడు మర్చిపోకుండా తెచ్చిపెట్టని." సరే అతను చెప్పాల్సిన విధంలో చెప్పి పట్టుకెళ్ళాడు."

"ఇక అదేపోతపోయాడు మామూలుగా!"

"ఎబ్బే! మళ్ళీ రెండుసార్లు కలిపించాడు. అతను అనుకుంటూనే రెండుసార్లు మర్చిపోయి వచ్చినట్లు చాలా మొహమాటపడి మాట్లాడాడు. సరే, రెండోసారి చెప్పాను "ఎల్లుండే బయలుదేరుతున్నాను. కాస్త ఇవాళా, రేపట్లో..." అనేదో నసిగి మళ్ళీ అన్నాను. "రేపు నాకు మీ పక్క రావాల్సిన పనుంది. ఎందుకేనా మంచిది కాస్త మీ యిల్లు ఎక్కడో చెప్పండి." ఏవో గుర్తులు చెప్పాడు. ఆఖరికి "మీ కా శ్రమ ఎందుకండీ? రేపు తప్పకుండా తీసుకొచ్చి మీకిస్తాను గదా! మీ లైటు తెచ్చిందిగాక మళ్ళీ మీకీశ్రమ కూడానా?" అన్నాడు.

"ఎంతమాట. ఏవో మనం అనుకోని పరిస్థితులు ఏర్పడొచ్చుగదా, ఏముంది ఇందులో..." అన్నాను. సరే ఆవేళకి అయిపోయింది. మర్నాడు సాయంత్రం అయింది. అతను అంతులేడు. కాని నాకు కోపం వచ్చిందిరా, సరే ఏంచేద్దాం అనుకుని బయలుదేరాను. అతని గుర్తు ప్రకారం ఒకగంటసేపు వెతికితేగాని వాళ్ళయిల్లు దొరకలేదు 'మన బుద్ధితక్కువ!' అనుకుంటూ వచ్చే కోపాన్ని అపుకొని వెళ్ళి తలుపు తట్టానురా. అయిదు నిమిషాలపాటు లోపల మనుషులున్న అలికిడే లేదు. నా కరికాలిమంట నెత్తికెక్కుతోంది ఏంచెయ్యను? మొత్తంమీద ఒక పది నిమిషాల తరువాత ఎవరోవచ్చి తలుపుతీశారు. నేను ఆ వైపు చూడటంలేదు. అతనే కనిపిస్తే నోటుంటు అన్యాయంగా ఏమేంమాటలు వస్తాయో అని నాకే భయంవేస్తోంది. "ఇంతలో ఎవరికోసమండీ?" అని స్త్రీకంఠం. "బ్రతికాన్రా భగవంతుడా" అనుకున్నాను.

"విశ్వేశ్వరరావుగారున్నారాండి?"

"లేరు"

"ఎక్కడికి వెళ్ళారో?"

"తెలియదు"

"మళ్ళీ ఎప్పుడు తిరిగిరావచ్చో..."

"తెలియదు"

"ఇంటివద్ద ఏమైనా చెప్పి వెళ్ళారా?"

"లేదు"

నాకు ఇంకేం తోచలేదు ఈ విరుపు సమాధానాలువింటోంటే. ఇంతవరకూ సరిగా మాట్లాడే వ్యక్తివైపు తిరగనేలేదు నేను.

"ఆయన షుమారు పదిరోజులక్రితం నాటార్చిలైటు తెచ్చారు నాకిప్పుడు దానితో పని వచ్చింది"

"లైటుసంగతి వాడునాతో ఏంచెప్పలేదు. ఇంట్లో ప్రస్తుతం మావాళ్లెవరూలేరు."

అప్పుడిహ నాకా వ్యక్తివంక చూడక తప్పింది కాదు. వినరా జాగ్రత్తగా రాజా! అదే ఆ బ్రహ్మముహూర్తం! ఆ క్షణంలోకే జీవితంలో తొలిసారిగా నేనా మధురమూర్తివంక చూసింది."

"పంథొమ్మిదీ ఇరవై ఏళ్ళుగల యువతి ఆ మూర్తి. మరి ఆ కురులు అలా ఎలా ముడి వేసిందో తెలియదు, ఒకఛాయ గోధుమరంగులో వున్నా ఆ కురులు అతిమెత్తగా—అప్పుడే స్నానంచేసిందో ఏమో—అతి మెత్తగా ఎంతో లావణ్యంతో అత్యంత సాధారణమైన ఆ ముడిలో చిత్రకారుడి రేఖలా వంపులితిరిగిపోయినయ్. ఇక ఆ ముఖం...అసలు ముహం అంటే ఏమిట్రా రాజా?" గంభీరంగా ప్రశ్నించాడు రామారావు.

రామారావు తలెత్తిచూసి "నువ్వే కానియ్" అన్నట్టు చూశాడు.

"వీడికి మతి స్థిరం తప్పిందని అనుకుంటున్నావేమిట్రా! నిజంగానే పోయింది మతి నాకు, ఇహ తరువాయి విను. కొద్దిసేపటికి తెప్పరిల్లి,

"రేపు నేను 'టూ' వెళ్ళిపోతున్నాను. విశ్వేశ్వరావుగారు రొచ్చాక, మీ స్నేహితుడు రామారావు ఇలా లైటు పట్టుకెళ్ళాడని చెప్పండి" అన్నాను ఇస్తుందిగదా అన్న ధైర్యంతో నీళ్ళు నములుతూ. ఆ చూపు మాట్లాడుతోంది.

"ఎవరిలో లైటు తెచ్చిన సంగతి మాత్రమే తెలుసు నాకు. వాడు అప్పైన దాని సంగతేమీ చెప్పలేదు నాకు."

నేను కొంచెం నవ్వు తెచ్చుకుని "పోనీ నేనొక ఉత్తరంవుంచి వెళ్తాను, మీకేం ఫర్వాలేదు! కాస్త...ఆ లైటు ఇప్పించండి. అవుసరం కనుక" అని ఆపేశాను.

ఆ యువతి మొహం తిప్పుకుని కొంతసేపు లోపలివైపు చూసింది. ఆ "ప్రొఫైలు" నిజంగా కొసలుదేలి-ఎవడో రచయిత రాసినట్టు కోసిన హల్వాముక్కలా తీర్చినట్టుండి స్నిగ్ధసౌకుమార్యంతో గుండెల్లో రెపరెపలు కల్గిస్తోంది. ఇంతలో ఇటు తిరిగి నోరు కుచించి, రేకుల్లా లఘువైన ఆ రెప్పల్ని బొమముడిలోకి అందంగావంచి అన్నదా అమ్మాయి: "మీరు చదువుతున్నారా?"

నా కికరా రాజా, నిజంగా వొళ్ళు తెలియలేదు. భావాల్ని కాస్త అణచి పట్టటానికి ప్రయత్నిస్తూ,

"ఇక్కడ యూనివర్శిటీలో బి. యస్. సి. ఆనర్సు చదువుతున్నాను" అన్నాను.

"ఏసంవత్సరము?"

"ఆఖరి సంవత్సరము" అని ఆ ముఖంలోకి చూశాను బాధను వ్యక్తపరిచే కవళికకోసం, నిజంగానే ఆ అమ్మాయి అదోలా విచారంగా ముఖం పెట్టి,

"ఆఖరి సంవత్సరమయితేనే చేయగల్గిందేమీ లేదు" అంది. నా పరిస్థితిరా రాజా, ఏమిటేమిటోగావుంది. ఇంతలోకే మళ్ళీ

"ఏ మొదటిసంవత్సరమో అయితే పెట్టే, బేడా సర్దుకుని ఇంటికి వెళ్ళమని సలహా ఇద్దామనుకున్నాను అండిరా! ఇహచూడు" అని కుర్చీలోంచి లేచి కూర్చున్నాడు రామారావు. రాజారావు నవ్వు ప్రారంభించి అప్పటికే కొంతసేపైంది. కడుపుబ్బి నవ్వి, లేచి కిటికీలోంచి సిగరెట్టుముక్క పారేసి మంచంమీద పడుకుంటూంటే...

"ఇప్పుడేదో చెప్తున్నా గాని అప్పటి నాస్థితి ఆ పరమాత్మకెరుక. ఏదో పెద్దదెబ్బ తిన్నట్టుగా వుందేగాని, ఎందుకలా అందో పూర్తిగా అర్థం కాలేదు నాకు-అయోమయం. అందుకనో, ఏమో ఇంకా విసిరింది బాణాలు. "లైటుసంగతి తెలియదుస్వామీ అంటోంటే ఉత్తరం ఉంచి వెళ్తానంటారేమిటి? లైటు పోయాక వుత్తరంకూడా ఎందుకు నెత్తిన కొట్టుకోనూ?" అంది. తిడితే

లిట్టించిగాని నాకప్పుడు పరిస్థితి బోధపడింది. ఇంతలోకే "నాకుపనుందివస్తా"నంటూ. జుట్టుముడి, ఎర్రటి ఆమెడ, గుత్తంగావున్న జాకెట్టూ, పూలు పూలుగావున్న సాదాచీర, ఇవన్నీ కలిపితే వచ్చే ధనుస్సులాంటి ఆ తేలికైన శరీరమూ ప్రదర్శిస్తూ లోపలికి దూసుకుపోయింది. పరిభ్రమిస్తున్న ప్రపంచం, కళకళలాడుతున్న మనోభావాలు, దిగులుగా అడుగున అడుగేస్తున్న శరీరం—నా స్థితి. అయితే ఒక సంతృప్తిమాత్రం మిగిలిందిరా రాజా!"

"అవున్లే ఇంత చదువు చదివి, ఏదోరకంగా సరిపెట్టుకోలేనంత బలహీనులం కాదుగా" అన్నాడు రాజారావు.

"మలుపు తిరిగానో లేదో ఏమండీ!" అని కేక. అటూ ఇటూ చూశాను ఎటు పిలుస్తున్నదో తెలియదు చివరకి పైకి చూశాను. మేడగది కిటికీ నుంచిరా, ఆ మనిషి నన్ను కేకెయ్యటం! నాకు తగని సిగ్గేసిందనుకో రోడ్డుమీద జనం మావంకే చూడటం ఏమిటో చెప్పండన్నట్టు కాస్త తగ్గాను. "మీకు దాంతో చాలా అవుసరం అంటున్నారు గనుక రాగానే వాడితో చెపుతాను" అంది నేను మెదలకుండా వచ్చేశాను.

"ఇంతకీ ఆ టార్చిలైటు చేరిందా నీకావేళ?"

"లైటూలేదు మట్టీలేదు. అదే జరిగితే మన గ్రంథం వుండకేపోను, అన్నాడు రామారావు. సరే లైటులేకుండానే టూరుకెళ్ళానురా చివరకి.

"ఇదిరా రాజా, వరస. తలకాయ పగిలిపోతూ వుండేది. ముందు ఎప్పుడు మళ్ళీ ఆ అమ్మాయితో ఎలా మాట్లాడాలా అని కొన్ని ఆలోచనలు. ఈసారి సమావేశ దృశ్యం ఎలా వుంటుందో, ఎలా వుండాలో ఆ మధురమైన ఊహాకల్పనలు అప్రయత్నంగా అనవరతం వస్తూపోతూ వుండేవి. మొత్తంమీద ఎలా అయితేనేం, ఆ మూడు వారాలటూరూ అయిందనిపించి వాల్తేరు చేరాము" రాజారావు రామారావుని ఆటంకం పరిచాడు:

"ఇంతకీ ఆ అమ్మాయి వివాహిత కాదని ఆధారమేమిటి నీకు?"

"ఆధారంలేదు మట్టీలేదు. అసలిప్పుడు నువ్వు చెప్పేవరకూ నాకు ఆలోచనరాందే—యువకుల 'సైకాలజీ'లో ఇదొక పెద్ద 'పాయింటు'లా వుంది" అన్నాడు రామారావు. "సరే విను వచ్చిన తరువాత మర్నాడే బయలుదేరాను డాబా గార్డెన్సులో వాళ్ళింటికి, విశ్వేశ్వర్రావుని ఇంటి వద్ద లేకుండా చెయ్యమని వేయిదేముళ్ళకి మొక్కుకుంటూ. ఈసారి రెండుమూడు నిమిషాల్లో తలుపు తెరిచారురా మొత్తంమీద తెరిచింది ఎవరో పనిమనిషి. విశ్వేశ్వర్రావు కానందుకు మనసుకెంతో వూరట లభించింది. హాలుకి ఒక పక్కగా కిటికీదగ్గర ధోవతికప్పుకుని ఒక పెద్దాయన పడకకుర్చీ పడుకుని పేపరుచూస్తున్నాడు."

"అంటే నువ్వీసారి వెళ్ళింది ఏవేళప్పుడు?"

"సాయంకాలం సుమారు నాలుగైవుంటుంది. ఓ, అదా .. వైజాగ్‌కి పేపరు సాయంకాలం వస్తుందిలే. సరే నేను ప్రవేశించటంచూసి పేపరు ప్రక్కకుతీసి "ఏమండీ...రండి" అన్నాడాయన. సరే, విషయం వివరించాను. ఆయన విని "ఆ, మావాడు మొన్ననే గ్రామాంతరము వెళ్ళాడు. రేపుగాని రాడు. ఆ లైటు సంగతీ...మొన్న వాడు వెళ్ళేప్పుడు...అమ్మాయితో ఏదో చెప్తున్నట్టు జ్ఞాపకం ... కనుక్కుంటానాగండి ఒక క్షణం" అని ఆ ముసలాడు "రాధా!... అమ్మాయ్ రాధా!" అని మూడు నాల్గు కేకలు పెట్టాడు. లోపలినుంచి భార్యకాబోలు వచ్చి, "రాధ పైనుందేమో, మేడమీద" అంది.

"కాస్త ఇటు పిలిపించు."

"చిన్నమ్మాయిలు స్కూలునించిరాలేదు, పని మనిషి వెళ్ళిపోయింది" అని వెళ్ళిపోయింది.

ఆయన నా వైపు తిరిగి "నేను అన్నప్పుడల్లా ఆపైకిపోలేను. పైన మా పెద్దమ్మాయుంటుంది. కాస్త శ్రమనుకోక అడిగితెచ్చుకోనాయనా... మెట్లు ఆ పక్క గదిలోంచి... అక్కడే" అని చూపించాడు: ఏదో సినిమాల తాలూకు 'హీరో'లా వుంది నాపని, తమ ఆడపిల్లల విషయంలో అంత నమ్మకం, నిర్భయత్వం చూపే కుటుంబాలు తెలుగు దేశంలో వున్నాయంటే మనం నమ్మలేం. కాని ఇవన్నీ ఆలోచించటానికప్పుడు నాకు టైములేదు. కాని ఇంత బాగా కలిసివచ్చే సంఘటనలు ఎవడిజీవితంలో అయినా ఎన్ని వుంటాయంటావ్? మనసు భరించ

రానంత సంతోషంతో గాలిలో పైపైకి తేలిపోతున్నట్టుగా ఆ మెట్లమీదికి వెళ్ళాను. పైకివెళ్ళాక రెండుగజాల దూరంలో అటొకటిఇటొకటి రెండు గదులున్నాయ్. ఎడమచేతివైపున్న గదికి బయట గడివేసి వుండటం చేయ నాపని సులభమయింది. ఏదో వెళ్ళి లైటుసంగతి చూసుకోటం నా ఉద్దేశం కాదుగా! అసలు ఏంచేస్తో వుండివుంటుందో తలుపు చాటునుంచి చూడాలని దుర్బుద్ధి పుట్టిందిరా! సరే! అడుగులో అడుగేసుకుంటూపోయి తలుపు పక్కనుంచి లోపలికిచూశాను. చూశానా అంతే. బహుశా ఏ అయిదు నిమిషాలపాటో ఆ చూపు అలాగే ఘనీభవించింది. ఇదివరకు కూడా అలాగే చూశాను. కాని అప్పుడు ఒక రకమైన అద్భుత భావంతో, కేవలం ఎడ్మిరేషన్‌తో చూశాను.

"ద్వారం వైపు తలా, అవతలివైపువకు కాళ్లు వుంచి ఏదో పుస్తకము చదువుతూ పడుకుని వుందిరా. ఇంతలో సన్నగా నవ్వుతోందిరా పుస్తకంలో ఏ సంఘటనో ఏమో! అప్పుడు హఠాత్తుగా భయమేసిందిరా నాకు. అసలు ఎవడో వచ్చినట్లు గమనించి కూడా ఏడిపిద్దామని యిలా చేస్తోందేమో! కాకపోయినా ఎవరైనా ఇప్పుడు పైకివస్తే? ఇంక ఎంతోసేపు అక్కడ నిలబడటం యోగ్యం కాదనిపించింది. ఒక్కసారిగా చప్పుడు చేస్తూ లోపల ప్రవేశించి "ఏమండీ!" అంటున్నాను. ఒరే, రాజా! నిజంగా అలాంటి సీను ఒకటిప్రత్యక్షంగాచూస్తేగానిఅందులోస్వారస్యం అంతుపట్టదు. ఎవడో కొత్తమొగాడు హఠాత్తుగా గదిలో ప్రవేశించటంవల్ల కలిగే తత్తరపాటు లజ్జాభయాలతోకూడిన వైవర్ణ్యం. నేను మంచం ఈ చివర వరకూపోయి నిలబడి తడుముకుంటూ, "ఆ లైటు... ..." అని ఇంకేదేదో గొణుగుతున్నాను. ఆ అమ్మాయి ఏం మాట్లాడ ప్రయత్నించటంలేదు సరిగదా, సర్దడం ఆపి ఈపక్కకి తిరిగేప్పటికి —ఏమనుకుందో ఏమోగానిరా— మొహంమీద చిరుకోపం, ఉక్రోషం మొదలైనవి కనుపిస్తున్నవి. ఏదో చెప్తున్నాగాని, అప్పుడు నా పని ఎలావుందనీ వొట్టి ఖంగారు, భయం తప్పు చేస్తున్నామేమో అని సంకోచం. ఈ పరిస్థితిలో ఆ అమ్మాయి గభాలున వెనుదిరిగి వెళ్లిపోవటానికి చరచరా సాగింది. గది చిన్నది కావడంచేత, పాపం అలమారుతలుపుకగలటం, ఇందాకా కంగారులో వదిలేసిన పుస్తకంమీద కాలుపడటంలో తిరిగి ఝల్లుమన్నట్టుగా పక్కకు తూలటం, ఆ తూలిన స్థితిలోనే అమ్మాయిని దగ్గిరికి తీసుకున్నాను." ఇప్పుడు రామారావు ఇదంతా చాలా వరకు సాభినయంగా వర్ణిస్తున్నాడు. రాజారావు జాగ్రత్తగా వింటూ, "ప్రేమరా!" అన్నాడు.

వెటకారంగా అన్నాడేమోనని రామారావు అనుమానం. కాని సందర్భంనుంచి దూరంపోవడం అతని కిష్టంలేదు

"ఏమైనా కానీయ్యరా, అదీస్థితి నువ్వు నమ్ముతావోలేదో గాని" అని ఆపాడు రామారావు, రాజారావు ఏమంటాడో అని.

"ఇహ అంతేరా, ఆ మంచంమీద పడి మొహం కప్పుకుని ఒకటే ఏడవటం మొదలెట్టింది. నాకేం తోచలేదు. ఇప్పుడు తలుచుకుంటే చాలా అసహ్యం అనిపిస్తుంది, అలాంటి వెధవ 'పొజిషన్' అది. ఏదేదో అనబోయాను "భయం లేదులే, మీవాళ్ళ కిష్టమైతే, నిన్ను పెళ్ళాడ దలిచాను" అన్నట్టు తేల్చాను. ఇహ చూడరా రాజా, ఆ మంచంపట్టె పట్టుకుని, ఆ వైపు నిలబడి, ఆ ఎర్రటి పుచ్చిన ముఖం, ఆ తళుక్కుమనే అశ్రుసిక్త నయనాలూ అప్పుడప్పుడిటు తిప్పుతూ అన్నమాటు అనకుండా నాలుగు నిమిషాలసేపు ఏవేవో తెగ తిట్టిందిరా, ఏడుస్తూనే. ఆ గదిలో అలా చొరబడటానికి కొద్దిగానైనా జ్ఞానముండక్కర్లే అంది. చదువుకున్నవాళ్ళ సంస్కారం. కాబోలంది. ఖర్మకాలి ఇలాంటివాణ్ణే చేసుకోవాలా అంది. గదివదిలి శీఘ్రంగా పొమ్మంది ఆఖరిమాటుగా" రాజారావు విరగబడి నవ్వుతున్నాడు.

"చివరకి నీ ప్రయత్నం అంతా ఇలా అయేప్పటికి నీకు మతిపోయుంటుంది."

"ఆ, ఒక గొప్ప అవకాశం చేతులారా పోగొట్టుకున్నానా? ఇది ఏం కాబోతోంది? అని పుట్టెడు దిగులేసిందిరా. కాని అప్పుడు నేను పైకివచ్చి అంతసేపు అయిందిగదా, ఎవరన్నా పైకి వస్తారేమో అన్న ఆలోచన నాకుగాని, ఆ అమ్మాయికిగాని లేదు. అన్నిటికి సిద్ధపడివుండటం

చేత భయంలేకుండా పోయిందనుకుంటూ. సరే అలా కాదని నా బాధంతా వెళ్ళబోసుకుంటూ సుమారు అయిదు నిమిషాలసేపు ఆవేశంతో మాట్లాడేశాను. ఇంతసేపూ నావైపు తిరక్కుండా కదలకుండా అలానే కూచుందిరా "నువ్వు దీని కొప్పుకోకపోతే నా పరిస్థితి ఘోరమైపోతుంద"న్నాను. "నేను స్థితిపరుణ్ణే, మీవాళ్ళు వొప్పుకుంటారా?" అనడిగాను. "నాకు తెలియదు. ఎవరన్నా వస్తారు, వెంటనే వెళ్ళిపో" అంది విదిలించేస్తూ. ఇక మర్యాద కాదనుకుని—అలమారులోనే వుంది ఆ లైటు-అడక్కుండానే తీసుకుని కిందకి దిగివచ్చేశాన్రా. అదృష్టవశాత్తూ ఆ ముసలా డక్కడలేడు."

కాస్సేపాగాక రాజారావు అన్నాడు "అంతా ఏదో కలలో విషయంలా వుంది కదూ నీకు?"

"ఆఁ ఎవడికైనా చూడు అలాగే వుంటుంది. అంత తిట్టినా ఆ అమ్మాయికి నేనంటే ఇష్టమేనని మాత్రం గట్టిగా అనిపించింది. ఇహ తర్వాత ఒక వారం రోజులాగాక వాళ్ళ తండ్రిని కలుసుకోటం, ఆయన ఈ 'ఫైనల్ ఇయర్' పూర్తి కానివ్వండి, తర్వాత విషయంకదా అనటం, వేసవిలో నేను మావాళ్ళకి చెప్పి వుత్తరం రాయించటం, వాళ్ళు కట్నం ఏమీ ఇచ్చుకోలేమని సమాధానించటం, చివరికి పాణిగ్రహణంతో రాధని నా దాన్ని చేసుకోవటం వరసగా జరిగాయ్. ఇదీ మన గాథ. ఇంత లోకోత్తరమైన టార్చిలైటు వివాహాన్ని ఎక్కడా కనీవినీ వుండవు. అందుకనే, ఈ రామారావు అనేవాడు ఒక భార్యని కలిగివుండటం అనే ఒక అసహజమైన కార్యం జరిగిపోవటం—ఇప్పుడు పీడు ఆ రాధే ప్రపంచంగా, వూపిరిగా, సర్వంగా జీవించటం జరుగుతోంది ఒక కాల్పనిక జగత్తులో. ఇదిలా ఎంతకాలం పోతుందో, నేను మామూలు మనిషి కావటం అనే ఘోరమైన ప్రమాదం ఎప్పుడైనా తటస్థించే పక్షంలో దాన్ని తట్టుకోగలనో లేదో అని తెగ దిగులేస్తోందిరా" అని ఆదోమాదిరిగా మొహంపెట్టి కుర్చీలో చితికిలబడి కిటికీలోంచి బయటికి చూస్తున్నాడు రామారావు.

రాజారావు రామారావుకి సమాధానం చెప్పే ప్రయత్నమేమీ చెప్పలేదు కథాప్రారంభం నుంచి సాగుతున్న నవ్వుని ఆపేసి కొంత ఆలోచనా నిమగ్నుడైనట్టు కనిపిస్తున్నాడిప్పుడు మిత్రులిద్దరూ. అలా ప్రొద్దుపోయిన ఆ చీకటి రాత్రి నిశ్శబ్దంలో, ఆ మేడ గదిలో, విద్యుద్దీపకాంతిలో మౌనంలో కొంతసేపు గడిపారు.

రాజారావు లేచి మంచినీళ్ళు తాగి రామారావు కిచ్చి, లైటు ఆర్పేసి "బెడ్-లైటు" వుంచాడు. అస్పష్టమైన ఆ నీలికాంతిలో, యుద్ధభూమిలో రహస్య ప్రయత్నాన్ని చేస్తున్న యోధుల్ని జ్ఞప్తికి తెస్తున్నారు స్నేహితులు.

"నిద్రొస్తోందేమిట్రా, పడుకుందామా?" అన్నాడు రాజారావు.

"నిద్రాలేదు, ఏమీలేదు. నీ కథనం?"

"నా కథనానికేముందిరా రామం,... ఇదిగో చూడు శ్రీమతి నిన్ననే తమ్ముడితో ఉత్తరం రాయించింది- రెండో ఆడపిల్ల క్షేమంగా కలిగిందట" ఉత్తరం రామారావుముందు పారేస్తూ అన్నాడు రాజారావు.

విరగబడి నవ్వుతూవచ్చి "ఒరేయ్, ఒరేయ్" అంటున్నా ఆగక రాజారావు పక్కమీదపడి బాదడం సాగించాడు రామారావు.

స్నేహితుల నవ్వుతో రాత్రీ, గదీ, ప్రతిధ్వనించిపోయాయి.

---

ప్రేయసి పరధ్యాహ్నంగా చంద్రుడివంక చూస్తూంటే, ప్రియుడు వెనకపాటు నుండి వచ్చి ఆమెకళ్లు మూశాడు: "ఎవరో చెప్పుకో చూద్దాం. మూడు పేర్లలోగా నేనెవరో చెప్పేసేయాలి. లేకపోతే బలవంతాన నిన్ను ముద్దు పెట్టుకుంటాను" అన్నాడు.

ఆమె వెంటనే "దాదాభాయ్ నౌరోజీ, సురేంద్రనాథ్ బెనర్జీ, రాజారామ్ మోహన్ రాయ్!" అంది.